సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 31 । మార్చి । 2025



కమిషనరా...మజాకా!

'రోమ్ నగరం తగలబడుతుంటే, నీరో చక్రవర్తి ఫిడేలు వాయించుకున్నట్లు'గా ఉంది మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వ్యవహార శైలి. - 8లో



మత సామరస్యానికి ప్రతీక

వైఎస్సార్ కడప జిల్లాలోని హిందూ, ముస్లిం సోదరులు కలిసిమెలిసి జీవిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా జిల్లాను నిలిపారని జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.9 /24.0

జిల్లాలో ఆదివారం 24.0 - 39.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు
– కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందుల : జిల్లాలోని ముస్లిం సోదరులకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. నెలరోజులపాటు కఠోర ఉపవాస దీక్షలతో పాటు ప్రత్యేక ప్రార్థనలు, దాతృత్వానికి ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. రంజాన్ పండుగను కలిసికట్టుగా ఆనందంగా జరుపుకోవాలని.. అందరికీ శుభాలు అందాలని మనసారా ఆకాంక్షించారు.

రాయచోటి వాసికి అవార్డు



గుండాల రెడ్డిరాఘవేంద్ర

రాయచోటి టౌన్ : ఒడిశా పోలీసు శాఖ అందించే ప్రతిష్టాత్మకమైన డీజీపీ డిస్క్ అవార్డును రాయచోటి పట్టణానికి చెందిన గుండాల రెడ్డిరాఘవేంద్ర (ఐపీఎస్) అందుకోనున్నారు. ఆయన ప్రస్తుతం ఒడిశాలోని నౌపాడా జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. 2024–25 సంవత్సరానికి అవార్డును అందుకోవడానికి ఎంపికైన పోలీసు సిబ్బంది పేర్లను ఒడిశా పోలీసు రాష్ట్ర ప్రధాన కార్యాలయం ప్రకటించింది. చలపతిని ఎన్‌కౌంటర్ చేయడంలో ప్రధాన పాత్ర పోషించడంతో పాటు నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించడంలో కృషి చేసినందుకు అవార్డు అందుకోనున్నారు. అవార్డు గ్రహీతలను 2025 ఏప్రిల్ 1న పోలీసు నిర్మాణ దినోత్సవం సందర్భంగా సత్కరించనున్నట్లు రెడ్డిరాఘవేంద్ర తెలిపారు.

ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తారా?



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న పాస్టర్లు

కమలాపురం : ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తారా? అని కమలాపురం మండల పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుదాస్ మండిపడ్డారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై కమలాపురం పాస్టర్ అసిసోయేషన్, పట్టణ క్రైస్తవ సంఘాల ఐక్యతతో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. గ్రామ చావడి నుంచి క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ సాగింది. అనంతరం క్రాస్ రోడ్డు వద్ద కొవ్వొతులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తారా? అని ప్రశ్నించారు. ముఖ్యంగా పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. పాస్టర్లకు ప్రభుత్వాలు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతి వెనుక ఎవరున్నారో నిగ్గు తేల్చాలన్నారు. కారకులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. సెక్రటరీ సునీల్‌దత్, వివిధ చర్చిల పాస్టర్లు పాల్ కుమార్, డేవిడ్ రాజ్, పి. రాజు, విజయ్, సురేంద్ర పాల్, స్టీఫెన్, శౌరీ, హెప్సిబా, రాజ్ కుమార్, జయరాజ్, పి.సామ్యూల్, టిపిఎం బ్రదర్, మనోహర్, అరుల్ ప్రసాద్, యు. సాల్మన్, ఐక్యతరావ్ తదితరులు పాల్గొన్నారు.



కడప బిల్టప్ ఈద్గాలో ఏర్పాటు చేసిన చలువ పందిరి

ఈద్ ముబారక్ హో!

- నేడు ఈద్–ఉల్– ఫితర్
- ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలలో ఏర్పాట్లు

కడప కల్చరల్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానేవచ్చింది. నెల రోజుల కఠోర ఉపవాస దీక్ష ఆదివారం నెలవంక దర్శనంతో ముగిసింది. సోమవారం ఈద్–ఉల్–ఫితర్‌కు ముస్లింలు సిద్ధమయ్యారు. ఈద్గాలు.. మసీదుల వద్ద ఈద్ ప్రార్థనల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. 'ఈద్‌కా చాంద్' చూసిన ముస్లింలు ఆనందపరవశులయ్యారు. మసీదుల్లో తరావీ ప్రార్థనలు ముగించారు. ఈ నెలంతా ముస్లింలు పూర్తిగా ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. ప్రత్యేక నమాజులు, ఖురాన్ పఠనం పూర్తి చేశారు. మసీదు కమిటీల ఆధ్వర్యంలో సోమవారం పండుగ ప్రత్యేక ప్రార్థనల నిర్వహణ కోసం తగిన ఏర్పాట్లు చేశారు. మసీదుల వద్ద కంటే ఈద్గాలలో ప్రార్థనలు నిర్వహించేందుకే ఎక్కువ మంది భక్తులు రానున్నారు. కడప నగరవాసులు బిల్టప్ ఈద్గా, ఆలంఖాన్‌పల్లె వద్దగల దండు షాహీ ఈద్గా, జమాల్‌పల్లె, మాచుపల్లె, రిమ్స్ వద్దగల ఈద్గాలలో పండుగ ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇందుకోసం కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. మైనార్టీశాఖ, కార్పొరేషన్ అధికారులు ఈద్గా మైదానాలలో పారిశుధ్య పనులు నిర్వహించారు. ప్రార్థనలకు వచ్చే వారి కోసం మంచినీటి వసతి సిద్ధం చేశారు.



ఆధ్యాత్మిక ప్రసంగానికి సిద్ధమైన వేదిక

ఎండ ప్రచండం!

ఎండలు అదరగొడుతున్నాయి. పొగలు కక్కుతున్న భానుడి దెబ్బకు రోడ్లపై సెగలు పుడుతున్నాయి. గతేడాదితో పోలిస్తే సీజన్ ప్రారంభంలోనే ఎండలు చురుక్కుమంటున్నాయి. మార్చి మొదటి వారంలోనే వేడెక్కిన సూరీడు.. నెల దాటేసరికి నిప్పులు కక్కుతున్నాడు. వెరసి జనాలు అల్లాడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు ఎండ దెబ్బకు జ్వరాలబారిన పడుతున్నారు.

- వేడెక్కిన సూరీడు.. 'ఉక్క'రిబిక్కిరవుతున్న జనాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



నిర్మానుష్యంగా కడప కృష్ణా సర్కిల్

పులివెందుల రూరల్ : పది రోజులుగా ఎండల ప్రభావం తీవ్రంగా ఉండడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయంతో జంకుతున్నారు. ఎండ తీవ్రతకు గురై చాలా మంది అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ఎండలో తిరగడం వల్ల జ్వరాలతోపాటు దగ్గు, జలుబు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా వేసవి కాలంలో కూడా దగ్గు, జలుబు, జ్వరాలు రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

వడదెబ్బ నివారణకు అప్రమత్తతే ముఖ్యం

ఎర్రగుంట్ల : ఎండ తీవ్రత అధికమైంది, ప్రస్తుతం జిల్లాలో 40–42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్(శరీరంలో నీటి శాతం తగ్గడం) డయేరియా(విరేచనాలు) తదితర సమస్యలతో ఇబ్బంది పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎర్రగుంట్ల, చిలంకూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలియజేశారు. ప్రజలు వేసవిలో వీలైనంతగా పని చేయకుండా ఉండడం మంచిదని సూచిస్తున్నారు. ఉదయం సాయంత్రం మాత్రమే ప్రజలు పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువ సేపు పనిచేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, నొప్పులు వస్తాయి, ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వేళ్లే అవకాశం ఉంది.

వేసవిలో చేయకూడని పనులు..

- ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో ఎక్కువగా తిరగరాదు.
- మద్యం తాగరాదు.
- రోడ్లపై మీద చల్లని రంగు పానీయాలకు దూరంగా ఉండాలి.
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం జోలికి వెళ్లకపోవడమే మంచిది.
- వేసవిలో మాంసాహారం తగ్గించడం శ్రేయస్కరం
- ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తినకూడదు.

చేయాల్సిన పనులు

- నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీటితో పాటు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి. పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి
- భోజనం మితంగా చేయాలి
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి
- ఆరుబయట పడుకున్నప్పుడు దోమ తెరలు వాడాలి
- బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి
- చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి
- తాజా కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి

వడదెబ్బలకు ప్రథమ చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడల ప్రదేశానికి చేర్చాలి
- ఐస్ నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం బాగా తుడవాలి
- శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి
- ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి లేకుంటే గ్లూకోజు ద్రావణం తాగించాలి
- వడదెబ్బ తగిలితే వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

ఎన్నడూ లేని విధంగా ఎండలు



గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎండలు ఉన్నాయి. ఉదయం 10 గంటల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. బయటికి రావాలంటేనే భయమేస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులు ఎవరూ బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
– బాబు, స్థానికుడు, పులివెందుల

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం మార్చిలోనే ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ప్రజలు జాగ్రత్తలు తీసుకుని బయటికి వెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా బయటకు వెళ్లేటప్పుడు కొబ్బరి బొండాలు, మంచినీరు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. పనులమీద బయటికొచ్చిన వారు మధ్యాహ్నం 12.30గంటలకల్లా ఇంటికి చేరాలి. సాయంత్రం 4.30 తర్వాతే బయటికి వెళ్లడం ఉత్తమం. వైద్యుల సలహాలు పాటించాలి.
– శ్రీనివాస్, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్, పులివెందుల

జాగ్రత్తలు తప్పనిసరి



ఈ సారి వేసవికాలం మార్చి మొదటి వారంలోనే ప్రారంభమైంది. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సంబంధిత వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండలో వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు అంటున్నారు. మంచినీరు ఎక్కువగా తాగాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహం రక్తపోటు క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగులు మరింతగా అప్రమత్తంగా ఉండాలని వివరిస్తున్నారు. గర్భిణీలు, ఐదేళ్లలోపు చిన్నారులు తప్పనిసరిగా ఈ జాగ్రత్తలు పాటించాలి.

ఆరోగ్య సమస్యలు ఇవే



ఎండ తీవ్రత వల్ల ఆకస్మికంగా వాంతులు విరేచనాలతోపాటు తీవ్ర కడుపు నొప్పి వస్తుంది. చలితో కూడిన జ్వరాలు, తీవ్రమైన చలితో బాధపడుతుంటారు. వికారంగా ఉండటం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎండలో తిరిగే వారిలో చాలామందికి రాత్రిళ్లు నిద్ర పట్టదు.

రోజుకు 4 లీటర్ల నీరు తాగాలి



కలకడ : వేసవిలో వృద్ధులు, చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఈసమయంలో మంచినీరును అధికంగా తీసుకుని, కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటిస్తే వేడిమి నుంచి ఉపశమనం పొందొచ్చని కలకడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున సూచిస్తున్నారు. ప్రతి వ్యక్తి రోజుకు నాలుగు లీటర్ల నీరు తాగడం చాలా అవసరం. ప్రతి 2గంటలకు అరలీటరు నీటిని విధిగా తాగాలి. భోజనం తినే సమయంలో తక్కువగా..అరగంట ఆగిన తర్వాత ఎక్కువ నీరు తాగాలని తెలియజేస్తున్నారు.

వైభవంగా బలిజపల్లె గంగమ్మ జాతరకు అంకురార్పణ

వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో బలిజపల్లె గంగమ్మ జాతర రెండో పెద్ద జాతరగా ప్రసిద్ధిగాంచింది. ఏప్రిల్ 3వ తేదీ జరగనున్న గంగమ్మ జాతరకు ఆదివారం రాత్రి నిర్వాహకులు అంకురార్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అంకురార్పణ వేడుకను తిలకించేందుకు పట్టణ వాసులే కాక వివిధ గ్రామాల నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో బలిజపల్లెలో స్వయంభుగా వెలసిన గంగమ్మ ప్రాంగణం భక్తజనంతో నిండిపోయింది.

గంటకు పైగా పూజలు

గంగమ్మ జాతర అంకురార్పణ వేడుక సందర్భంగా నిర్వాహకులు గంగమ్మ స్వయంభుకు గంటకు పైగా పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి స్వయంభును పుష్పాలతో అలంకరించారు. ఒకవైపు పూజా కార్యక్రమాలు జరుగుతుండగా, మరోవైపు తప్పెట్ల దరువులు, కొమ్ము ఊదడం, గంగమ్మ ఆవహించిన భక్తులు ఊగిపోవడం చూసి భక్తులు ఆనందపరవశులయ్యారు. జాతర అంకురార్పణకు ప్రధాన ఘట్టమైన పోతు మెడలో దండ పడగానే భక్తులు పెద్దఎత్తున చప్పట్లు చరించి, ఈలలు, కేకలు వేయడంతో బలిజపల్లె గ్రామం దద్దరిల్లింది. ప్రతి ఏడాది అంకురార్పణకు వేలాది మంది భక్తులు తరలి వస్తారు. దీంతో తోపులాటలు జరిగేవి. అయితే ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే చొరవ తీసుకోవడంతో ఈఏడాది తోపులాటలు వంటివి జరగకుండా అర్బన్ సీఐ రాజ, ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. గంగమ్మ స్వయంభు ప్రాంగణం చుట్టూ రోప్ ఏర్పాటు చేసి తోపులాటలకు చెక్ పెట్టారు.



జాతరకు అంకురార్పణ చేస్తున్న నిర్వాహకులు



అంకురార్పణ వేడుకను తిలకించేందుకు తరలి వచ్చిన భక్తులు

ప్రజల జీవితాల్లో కాంతి నింపాలి



పంచాంగ పఠనం చేస్తున్న సొట్టు సాంబమూర్తి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, ఇతర అతిథులు

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
- కలెక్టరేట్‌లో ఘనంగా ఉగాది వేడుకలు



చిన్నారి నృత్య ప్రదర్శన

కడప సెవెన్‌రోడ్స్ : శ్రీ విశ్వావసు నామ తెలుగు నూతన సంవత్సరం జిల్లా ప్రజల జీవితాల్లో ఉషస్సు నింపాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. ఆదివారం కలెక్టరేట్ సభా భవనంలో దేవదాయ ధర్మాదాయశాఖ, పర్యాటక శాఖ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొత్త సంవత్సరంలో అందరికీ పరిపూర్ణమైన ఆరోగ్యం సిద్ధించాలన్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పల్లె సీమలు పాడి పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని అభిలషించారు.

అన్ని రంగాలకు శుభసూచికం : విద్వాన్ సొట్టు

జ్యోతిష్య శాస్త్ర ప్రకారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం అన్ని రంగాల వారికి శుభసూచికమని సంస్కృతాంధ్ర సాహితీ పురాణ పండిట్ విద్వాన్ సొట్టు సాంబమూర్తి అన్నారు. ఆయన పంచాగ పఠనం చేస్తూ విశ్వావసు నామ సంవత్సరం అంటే విశ్వానికి సంబంధించిందన్నారు. ఈ ఏడాది కరువు కాటకాలు ఉండవని... పంటలు బాగా పండేలా వాతావరణం అనుకూలిస్తుందన్నారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు జీవితంలో ఎదురయ్యే వివిధ అనుభవాలకు సంకేతాలన్నారు. కొత్త ఏడాదిలో అడుగు పెట్టిన వారంతా మంచి, చెడు ప్రతి అనుభవాన్ని సమానంగా స్వీకరిస్తూ ముందుకు వెళ్లాలన్నదే ఉగాది పచ్చడి తినడం వెనుక ఉన్న పరమార్థమని వివరించారు. అనంతరం రాశి ఫలాల గురించి చదివి వినిపించారు.

నలుగురు పండితులకు ఉగాది పురస్కారాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వేద పండితులు, అర్చకులు, కవులకు అందించే ఉగాది పురస్కారాలు ఈ యేడు జిల్లాకు చెందిన నలుగురికి వచ్చాయి. ప్రొద్దుటూరుకు చెందిన శ్రీనివాసాచార్యులు, పులివెందులకు చెందిన కలుబండి రామకుమార్‌శర్మ, కడపకు చెందిన గోపాలకృష్ణశర్మ, సొట్టుసాంబమూర్తిలకు దేవాదాయశాఖ ద్వారా ఒక్కొక్కరికి రూ. 10,116 పారితోషికం, ప్రశంసా పత్రం అందజేసి కలెక్టర్ శ్రీధర్ ఘనంగా సత్కరించారు. అనంతరం ఉత్తమ అర్చకులు ఎస్.నరసింహాభట్టార్, బి.చంద్రమౌళిశర్మ, ఎస్.శశిధర్‌లకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, దేవదాయశాఖ సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, పర్యాటకశాఖ అధికారి సురేష్ పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ఉగాది వేడుకల సందర్భంగా ముద్ర అకాడమి లహరి బృందం చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. అనంతరం వారిని కలెక్టర్ సత్కరించారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది.

జిల్లాలో సీఐల బదిలీలు

కర్నూలు రేంజ్ పరిధిలో వివిధ సర్కిళ్లలో, ప్రాంతాలలో విధులను నిర్వహిస్తున్న సీఐలను బదిలీ చేస్తూ ఆదివారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ జాబితా వివరాలిలా ఉన్నాయి. – కడప అర్బన్

సీఐ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న చోటు	బదిలీ అయిన ప్రదేశం
యు. సదాశివయ్య	పీ.టీ.సీ తిరుపతి	ప్రొద్దుటూరు టూటౌన్
ఎం. యుగంధర్	ప్రొద్దుటూరు టూటౌన్	ఆళ్లగడ్డ యూపీఎస్
ఎస్. చిరంజీవి	ఆళ్లగడ్డ యూపీఎస్	ఫ్యాక్షన్ జోన్, కర్నూలు
కె.యల్లమరాజు	వి.ఆర్, అన్నమయ్య	మహిళా పోలీస్‌స్టేషన్, కడప
ఎం.కృష్ణారెడ్డి	మహిళా పోలీస్‌స్టేషన్, కడప	చెన్నూరు యూపీఎస్
ఆర్.పురుషోత్తం రాజు	చెన్నూరు యూపీఎస్	ఎస్.బి–1,కడప
టి.రెడ్డెప్ప	ఎస్..బి.1,కడప	సీసీఎస్-2, కడప
ఎస్. చాంద్‌బాష	సీసీఎస్-2	పులివెందుల యూపీఎస్
టి.నరసింహులు	పులివెందుల యూపీఎస్	వేంపల్లి యూపీఎస్
ఏ.సురేష్ రెడ్డి	వేంపల్లి యూపీఎస్	వి.ఆర్, కడప
పి. ఈశ్వర్‌రెడ్డి	వి.ఆర్, కడప	డీసీఆర్‌బీ, కడప
యు. వెంకటకుమార్	డీసీఆర్‌బీ, కడప	వి.ఆర్, కడప
హెచ్.కృష్ణంరాజు నాయక్	వి.ఆర్, కడప	సీసీఎస్–1, కడప
సీ. భాస్కర్‌రెడ్డి	సీసీఎస్–1, కడప	వి.ఆర్, కడప
వి.శ్రీహరి	వి.ఆర్, కర్నూలు	మైదుకూరు యూపీఎస్
ఎం.గంగిరెడ్డి	వి.ఆర్, నంద్యాల	సీసీఎస్–2, నంద్యాల

ముంబై ఐఐటీలో వెలిగిన తెలుగుతేజం



సాయిదివ్యతేజరెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : ముంబై ఐఐటీ కళాశాలలో జరిగిన అండర్ గ్రాడ్యుయేషన్(యూజీ) సోషల్ సెక్రటరీ ఎన్నికలో అన్నమయ్య జిల్లా రాయచోటి తాలూకా చెన్నముక్కపల్లి గ్రామానికి చెందిన సాయిదివ్యతేజరెడ్డి విజయం సాధించాడు. శ్రీనివాసులురెడ్డి, జయలక్ష్మీల కుమారుడైన సాయిదివ్యతేజరెడ్డికి ముంబై ఐఐటీలో సీటు వచ్చింది. ఇటీవల జరిగిన యూజీ సోషల్ సెక్రటరీ ఎన్నికలో పోటీ చేశాడు. గెలుపొందాడు. ఐఐటీ ముంబై చరిత్రలో తొలిసారిగా ఒక తెలుగువాడు ఎన్నిక కావడం ఇదే తొలిసారి.

క్లుప్తంగా

ఉగాది పురస్కారాలు అందుకున్న జిల్లా వాసులు



పురస్కారం అందుకుంటున్న విద్వాన్ గానుగపెంట హనుమంతరావు

కడప కల్చరల్ : విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కారాలను ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. ఆయనతోపాటు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, అవధాని మాడగుల నాగఫణిశర్మ తదితరులు ఈ పురస్కారాలను కళాకారులకు అందజేశారు.

కడప నగరానికి చెందిన డాక్టర్ చింతకుంట శివారెడ్డి, మొగిలిచెండు సురేష్, బద్వేలుకు చెందిన విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, ప్రొద్దుటూరు వాసి జింకా సుబ్రమణ్యం, సాహిత్య విభాగంలో ఉగాది పురస్కారాలను అందుకున్నారు. నిర్వాహకులు వారికి తెలుగు తల్లి విగ్రహం, రూ.10 వేలు చెక్కు అందజేసి ఘనంగా సత్కరించారు.

రైతు పండింటి కృష్ణమూర్తికి..



ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న పండింటి కృష్ణమూర్తి

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రం, ఏరువాక కేంద్రం అభ్యుదయ రైతు పండింటి కృష్ణమూర్తి ఉగాది పురస్కారం అందుకున్నారు. వ్యవసాయ సాగులో ఆచరిస్తున్న వినూత్న పద్ధతులకు గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు 2024 సంవత్సరానికి రాయలసీమ ప్రాంతం తరపున ఎంపిక చేశారు. ఉగాది పండుగలను పురస్కరించుకుని ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర ఉగాది వేడుకల్లో రైతు పండింటి కృష్ణమూర్తికి ముఖ్యమంత్రి చంద్రబాబు జ్ఞాపిక, ప్రశంసాపత్రంతోపాటు రూ. 5 వేలు నగదు పురస్కారంతో సత్కరించారు.

వేంపల్లి షరీఫ్‌కు..



సీఎం చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకుంటున్న వేంపల్లె షరీఫ్

వేంపల్లె : వేంపల్లె పట్టణానికి చెందిన ప్రముఖ కథా రచయిత డాక్టర్ వేంపల్లె షరీఫ్ ఆదివారం ఉదయం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. పదివేల రూపాయల నగదు, శాలువా, మెమెంటోతో ముఖ్యమంత్రి ఆయనను సన్మానించారు. షరీఫ్ రెండున్నర దశాబ్దాలుగా సాహిత్య రంగంలో ఉన్నారు. ముఖ్యంగా కథా రచనలో కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఆయన నాలుగు కథా సంపుటాలు వెలువరించారు. మరో మూడు కథా సంకలనాలకు సంపాదక బాధ్యతలు నిర్వర్తించారు.

శ్రీరామ్‌కుమార్ శర్మకు..



ఉగాది పురస్కారం అందుకుంటున్న పంచాంగం శ్రీరామ్‌కుమార్ శర్మ

పులివెందుల టౌన్ : ఉగాది సందర్భంగా ఆదివారం కడప కలెక్టరేట్ సభా మండపంలో జరిగిన ఉగాది సంబరాల్లో పులివెందులకు చెందిన వేద పండితుడు, పురోహితుడు, పంచాంగం రామ్‌కుమార్ శర్మకు పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో శాసన సభ్యులు నంద్యాల వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్, యాదవ్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, దేవదాయ శాఖ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనరా...మజాకా!

- తాగునీటికి అల్లాడుతున్న గౌస్‌నగర్ ప్రజలు
- పబ్లిక్ వాటర్ పైపులైన్ నుంచి పొలాలకు నీటి కనెక్షన్
- 3 ఇంచుల పైపు కనెక్షన్ ఇచ్చిన కార్పొరేషన్ యంత్రాంగం
- ప్రైవేటు ప్రాపర్టీ నుంచి పైపులైన్.. అభ్యంతరం చెబితే బెదిరింపులు



వాటర్ ట్యాంకర్ల ద్వారా గౌస్‌నగర్‌లో నీరు పట్టుకుంటున్న మహిళలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : 'రోమ్ నగరం తగలబడుతుంటే, నీరో చక్రవర్తి ఫిడేలు వాయించుకున్నట్లు'గా ఉంది మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వ్యవహార శైలి. ఓ వైపు కడప నగరంలోని గౌస్‌నగర్ ప్రజలు తాగునీటికి ఇక్కట్లు పడుతుంటే అదే గౌస్‌నగర్‌లోని పబ్లిక్ వాటర్ పైపులైన్ నుంచి పొలాలకు నీటి కనెక్షన్ ఇస్తున్నారు. అదేమంటే పొరుగు జిల్లాలో ఉన్న కమిషనర్ కళ్లల్లో ఆనందం కోసమే చేస్తున్నామంటున్నారు. ప్రైవేటు ప్రాపర్టీ నుంచి ఎలా పైపులైన్ ఇస్తారంటూ అభ్యంతరం చెబితే ఐఏఎస్ అధికారితో సమస్య పెట్టుకుంటావా? అంటూ బెదిరింపులకు దిగుతున్న వైనమిది.

'లేనోడికి గంజి కూడా అమృతమే. ఉన్నోడికి అదే గంజి దుస్తులకు అవసరం.' అచ్చం అలాంటి ఘటనే కార్పొరేషన్‌లో చోటుచేసుకుంది. నిత్యం గౌస్‌నగర్‌లో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. సమస్యకు ఫుల్‌స్టాఫ్ పెట్టాల్సిన అధికారులు మరింత జటిలం చేస్తున్నారు. పబ్లిక్ వాటర్ పైపులైన్ నుంచి 3 ఇంచుల పైపుతో ప్రైవేటు వ్యక్తుల పొలాలకు నీరు ఇస్తున్నారు. స్థానికులు అదేంటని ప్రశ్నిస్తే సారు చెప్పారు.. కనెక్షన్ ఇస్తున్నాం. మీరేమన్నా ఉంటే సారుతో మాట్లాడుకోండంటూ కార్పొరేషన్ యంత్రాంగం జవాబు చెబుతున్నారు. ప్రైవేటు వ్యక్తుల స్థలంలో నుంచి వాటర్ పైపులైన్ ఎలా వేస్తారంటూ స్థల యజమాని నిలదీస్తే, కమిషనర్‌తో మాట్లాడుకోవాలంటూ జవాబు వస్తోంది. కమిషనర్ వద్దకు వెళ్లి మొరపెట్టుకుంటే ఐఏఎస్ ఆఫీసర్‌తో ఢీ కొంటావా.. తిరుపతి కమిషనర్ అడిగారు, ఆమె కోరిక మేరకే కనెక్షన్ ఇచ్చామని కమిషనర్ మనోజ్‌రెడ్డి వెల్లడించారని బాధితుడు వాపోతున్నారు. మరోవైపు మమ్మల్నే ప్రశ్నిస్తావా అంటూ తాను నిర్మించుకున్న కాంపౌండ్ వాల్ కూల్చాలంటూ నోటీసులు సైతం జారీ చేశారని బాధితుడు వివరిస్తున్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నోటీసు ఇచ్చామని చెబుతున్నా, తనొక్కడికే నోటీసు అందించడం వెనుక మతలబు బెదిరింపులేనని బాధితుడు స్పష్టం చేస్తున్నారు.

తిరుపాల్‌రెడ్డి పొలానికి పైపులైన్: ఎస్.అఫ్రోజ్ హుసేన్, కడప

గౌస్‌నగర్‌లోని అఫ్జల్‌ఖాన్ కాలనీ నుంచి తిరుపాల్ రెడ్డి పొలానికి పైపులైన్ ద్వారా కార్పొరేషన్ యంత్రాంగం నీరు ఇస్తోంది. సర్వే నంబర్లు 603, 604, 605, 610, 611లో దాదాపు 12.59 ఎకరాలు తిరుపాల్‌రెడ్డికి వ్యవసాయ పొలం ఉంది. ఆయన కోడలు మౌర్య తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఒత్తిడి కారణంగా అధికారులు నా సొంత స్థలం సర్వే నంబర్ 606/1బిలో 2.6 సెంట్లలో పైపులైన్ తీస్తున్నారు. పబ్లిక్ వాటర్ పైపులైన్ నుంచి 3 ఇంచుల పైపు కనెక్షన్ ఇస్తున్నారు. అభ్యంతరం చెబితే కమిషనర్ మనోజ్‌రెడ్డి బెదిరింపులకు దిగుతున్నారు. ఐఏఎస్ ఆఫీసర్‌తో సమస్య పెట్టుకుంటావా? అంటూ హెచ్చరిస్తున్నారు. ఇలాంటి చోద్యం మునుపెక్కడా చూడలేదు. ఇప్పటికైనా కార్పొరేషన్ యంత్రాంగం కళ్లు తెరిచి గౌస్‌నగర్ తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

వారం రోజులుగా నీటి సరఫరా లేదు– వలీ, గౌస్‌నగర్, కడప

మాకు వారం రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొన్ని వీధులకు నీరు వస్తుంటే, మరికొన్ని వీధులకు రావడం లేదు. పెన్నానదిలో పుష్కలంగా నీరు ప్రవహిస్తోంది. పైపులు సక్రమంగా లేకపోవడం వల్లే మా ఈ దుస్థితికి కారణమని కొందరు చెబుతున్నారు. పైపులు సరిచేస్తామని అధికారులు అంటున్నప్పటికీ ఇంతవరకు జరిగింది శూన్యం. గండి వాటర్ వర్క్స్ నుంచి నీటి సరఫరా గతంలో బాగానే జరిగేది. ఇప్పుడు లింగంపల్లి నుంచి ఇస్తున్నారని తెలుస్తోంది. సంవత్సరం క్రితం వరకు నీరు బాగానే వచ్చేది. ఇప్పుడు ఎందుకు రావడం లేదో అర్థం కావడం లేదు.



పబ్లిక్ వాటర్ పైపులైన్ నుంచి పొలాలకు కనెక్షన్ ఇచ్చిన దృశ్యం

కుళాయిల ద్వారా నీరివ్వాలి– సాబీరున్, గంజికుంట కాలనీ, కడప

తాగునీరు లేకపోతే ట్యాంకర్లను పంపించే పద్ధతి మాకు వద్దు. అందరిలాగే కుళాయిల ద్వారా నీరు అందించే శాశ్వత పద్ధతిని ఏర్పాటు చేయాలి. ట్యాంకర్లు ఎప్పుడు వస్తాయో తెలియదు. రాత్రంతా ట్యాంకర్ల కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. షుగరు, బీపీ వంటి వ్యాధులున్న వారి పరిస్థితి నరకప్రాయంగా ఉంది. పైగా నీటికోసం ట్యాంకర్ల వద్ద చిన్నచిన్న గలాటాలు జరుగుతున్నాయి. ఫరూఖ్ మసీదు వద్ద నుంచి వృథా నీటిని తెచ్చుకుంటున్నాము.

శ్రీ సోమేశ్వరుడి సేవలో జిల్లా జడ్జి



శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి దంపతులు

కడప కల్చరల్ : కడప నగరం దేవుని కడపలోని శ్రీ సోమేశ్వరస్వామిని ఆదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, రామారావు దంపతులు దర్శించుకున్నారు. ఉగాది పండుగ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేశారు. ఆలయ ఏఓ శ్రీధర్ వారికి స్వాగతం పలికారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

కడప అర్బన్ : కడప నగరం అక్కాయపల్లిలో నివాసం ఉంటున్న లక్ష్మిదేవి(32) అనే మహిళ కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ వివరాల మేరకు కర్నూలు జిల్లా దేవనకొండ మండలం బండపల్లి గ్రామానికి చెందిన వడ్డే లక్ష్మీదేవి (32), తన భర్త రాముడుతో కలిసి ఏడాదిన్నర క్రితం జీవనోపాధి కోసం కడపకు వచ్చారు. . ఏడాది నుంచి ఆమె కడుపు నొప్పితో బాధపడుతుండేది. శనివారం రాత్రి కడుపునొప్పి రావడంతో భర్త మాత్రలు తెచ్చేందుకు బయటకు వెళ్లాడు. అంతలోనే ఆమె విషద్రావణం తాగింది. భర్త గమనించి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

మా వాళ్లే టెండర్లు వేయాలి

కడప నగరపాలక సంస్థలో మా వాళ్లే టెండర్లు వేయాలి..ఇతర కాంట్రాక్టర్లు ఎవరూ వేయకూడదు. ఒకవేళ వేసినా వారి పనులు జరగనివ్వం. బిల్లులు రానివ్వం. టెండర్లు పొందిన వారు మేం ఎవరికి చెబితే వారికి ముట్టజెప్పాలి. ఇదీ తెలుగుదేశం పార్టీ ముఖ్యనేత, షాడో ఎమ్మెల్యే కాంట్రాక్టర్లకు చేస్తున్న హెచ్చరికలు.. తమ రూలును అతిక్రమించిన వారికి ఇబ్బందులు తప్పవని చెప్పకనే చెబుతున్నారు.. వివరాలిలా ఉన్నాయి.

– సాక్షి టాస్క్‌ఫోర్స్

- ఇతరులు వేసేదానికి వీల్లేదు
- వేసినా పనులు చేయనివ్వం
- 15వ ఫైనాన్స్ టెండర్లలో పాల్గొనేవారికి షాడో ఎమ్మెల్యే బెదిరింపులు
- విస్తుపోతున్న రాజకీయవర్గాలు

కడప నగరపాలక సంస్థలో 15వ ఆర్థిక సంఘం కింద జనరల్ బాడీ ఆమోదించిన రూ.13.34 కోట్ల పనులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించింది. 2021–22 మొదటి దశ కింద రూ.2.94 కోట్లు, 2023–24 మొదటి దశ కింద రూ.7.44 కోట్లు, 2023–24 రెండో దశ కింద రూ.4.96 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను మంజూరు చేస్తూ గత నెలలో ఉత్తర్వులు జారీ అయ్యాయి. నగర పాలక వర్గం ఉన్నప్పటికీ ఆ టెండర్లన్నీ తమకే దక్కాలని టీడీపీ ముఖ్యనేత పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇతర కాంట్రాక్టర్లను పలు రకాలుగా బెదిరిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆన్‌లైన్ టెండర్లు వేసే నెట్ సెంటర్ల యజమానులను పిలిపించుకొని ఈ మేరకు హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. ఈ టెండర్లన్నీ మా వాళ్లకే దక్కాలి. ఆ పనులన్నీ మా వాళ్లే చేయాలి...మేము ఎవరికి చెబితే వారికి 8 శాతం కమీషన్ ముట్టజెప్పాలి. ఇందుకు విరుద్ధంగా ఎవరు టెండర్లలో పాల్గొన్నా పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.. పనులు చేయలేరు.. బిల్లులు కూడా మంజూరు కావని బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. ఏఏ కాంట్రాక్టర్లు టెండర్లు వేయాలో జాబితా ఇచ్చి వారిచేతనే టెండర్లు దాఖలు చేయిస్తున్నట్లు తెలిసింది. దీంతో కార్పొరేషన్‌లో టెండర్లు వేయాలంటేనే మిగతా కాంట్రాక్టర్లు జంకుతున్నారు. గతంలో మంజూరైన పనులకు వీళ్లకెందుకు కమీషన్ ఇవ్వాలో తెలియక కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి నయాపైసా తీసుకురాకపోయినా.. పెత్తనమే

అభివృద్ధి పనులను త్వరగా, నాణ్యతగా చేసే కాంట్రాక్టర్లను ఆహ్వానించాల్సింది పోయి అడ్డుపడుతుండటాన్ని పలువురు తప్పుబడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క నయాపైసా నిధులు తేలేకపోయినా గత ప్రభుత్వంలో మంజూరైన కేంద్ర నిధులపై పెత్తనం చేయడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. నగరాభివృద్ధిని కోరుకునే ఏ ప్రజా ప్రతినిధి ఇలా చేయరని, అందినకాడికి దోచుకొని, వారి కార్యకర్తలకు దోచిపెట్టడానికే షాడో ఎమ్మెల్యే ఎక్కడా లేని రూలు పెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలచేత ఎన్నుకోబడిన మేయర్, కార్పొరేటర్లను కాదని.. ఎలాంటి ప్రొటోకాల్ లేని ఆ నేత పెత్తనం చెలాయిస్తుండటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉగాది సంబరాలు

కడప అర్బన్ : తెలుగు నూతన సంవత్సరాది శ్రీ విశ్వావసు నామ ఉగాది పండుగ సంబరాలను కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్ కుమార్, అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు, పోలీస్ అధికారులు, సిబ్బంది విచ్చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉగాది ప్రత్యేక పూజల్లో పాల్గొని ఉగాది పచ్చడి, మిఠాయిలు అందజేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉత్సాహ భరిత వాతావరణంలో ఉగాది సంబరాలు జరిపారు. జిల్లా ప్రజలకు, సిబ్బందికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ శ్రీ బి. రమణయ్య, ఆర్.ఐ లు ఆనంద్, వీరేష్, శ్రీశైల రెడ్డి, శివరాముడు, ఆర్.ఎస్.ఐ లు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉగాది పచ్చడి, మిఠాయిలను పంపిణీ చేస్తున్న జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్

తాగునీటికీ తప్పని రాజకీయం!

- కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న టీడీపీ
- తాము చేస్తే ఒప్పు .. ఇతరులు చేస్తే తప్పు
- వివాదాస్పదంగా టీడీపీ అధ్యక్షుని వ్యవహారం

టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. తాము చేస్తే ఒప్పు.. ఇతరులు చేస్తే తప్పు అన్నట్లుగా మండల టీడీపీ అధ్యక్షుడి వ్యవహార శైలి ఉంది. అధికారంలో ఉన్నాం కదా అని సర్పంచ్‌ను పక్కనపెట్టి తానే పెత్తనం చెలాయించాలనే ధోరణిలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. బద్వేలు మండలంలోని ఎస్.రామాపురం దళితవాడలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. ఇక్కడ తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరులో సుద్దనీరు వస్తుండటంతో తరచూ మోటారు కాలిపోతోంది. ఈ నీటిని స్థానికులు తాగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని సర్పంచ్ కూడా అంగీకరించి దానికి ప్రత్యామ్నాయంగా తాగునీటి సమస్య పరిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ఏదో ఒక విధంగా స్థానికంగా ఉన్న నీటి సమస్యను రాజకీయం చేయాలనే ఉద్దేశంతో దళితవాడలో ఉన్న కొందరు టీడీపీ నాయకులను మండల టీడీపీ అధ్యక్షుడు రెచ్చగొట్టడంతో పాటు టీడీపీ బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి ద్వారా అధికారులకు ఫోన్ చేయించారు. గతంలో వేసిన తాగునీటి బోరును సర్పంచ్ వర్గానికి చెందిన రైతు కబ్జా చేసి కంచె వేశాడని, ఆ బోరును ఎలాగైనా తిరిగి ఉపయోగించుకునేలా చూడాలని ఒత్తిడి తీసుకు వచ్చారు. దాదాపు 20 ఏళ్ల క్రితం వేసిన బోరు కావడంతో అది పూర్తిగా శిథిలమైంది. కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి పొలం కావడం, ఎలాగైనా అతనిపై కక్ష సాధించాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలకు పాల్పడినట్లు తెలుస్తోంది. టీడీపీ నియోజకవర్గ స్థాయి ఇన్‌చార్జి ఒత్తిడి మేరకు ఎంపీడీఓ రామనాథరెడ్డి, తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డిలు దళితవాడకు వెళ్లి అక్కడి పరిస్థితిని స్థానికంగా అడిగి తెలుసుకున్నారు. తరచూ మోటారు కాలిపోతోందని, నీటిలో సుద్ద వస్తోందని, ఈ నీటిని తాము ఉపయోగించుకోమని, ప్రత్యామ్నాయంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు అధికారులకు మొరపెట్టుకున్నారు. దళితవాడలో కొందరు రైతు పొలంలో ఉన్న బోరు ద్వారా తమకు తాగునీరు అందించాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రైతు పొలంలో ఏళ్ల తరబడి వేసిన బోరును కూడా అధికారులు పరిశీలించారు. స్థానిక టీడీపీ నాయకుడు గ్రామ పంచాయతీ బోరును ఏకంగా కబ్జా చేసి ఉపయోగించుకుంటున్నాడని, ఆ బోరును కూడా పరిశీలించి వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వర్గం అధికారులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ కబ్జా చేసిన బోరును కూడా అధికారులు పరిశీలించారు. పరస్పరం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో పరిశీలించి ఏప్రిల్ 2వ తేదీ తర్వాత నిర్ణయం తీసుకుంటామని అధికారులు ఇరువురికి తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీఓ రామనాథరెడ్డిని వివరణ కోరగా దళితవాడలో తాగునీటి సమస్య ఉందని, ప్రత్యామ్నాయంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో వేసిన గ్రామ పంచాయతీ బోర్ల కబ్జాలపై రెండు వర్గాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, వాటిని కూడా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దళితవాడకు తాగునీరు అందించే విషయంలో ఎక్కడైతే తాగునీటికి అనుకూలంగా ఉంటుందో నివేదిక ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరినట్లు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక కడప జిల్లా

- జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు
- ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్‌కుమార్



ఇఫ్తార్ విందును స్వయంగా వడ్డిస్తున్న జిల్లా ఎస్పీ ఈ.జీ. అశోక్‌కుమార్

కడప అర్బన్ : వైఎస్ఆర్ కడప జిల్లాలోని హిందూ, ముస్లిం సోదరులు కలిసిమెలిసి జీవిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా జిల్లాను నిలిపారని జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఉమేష్ చంద్ర స్మారక కల్యాణ మండపంలో ముస్లింలకు, పోలీస్ శాఖలోని ముస్లిం పోలీస్ అధికారులు, సిబ్బందికి రంజాన్ మాసం పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమీన్ పీర్ దర్గా ఇమామ్ ఇనాయతుల్లా ప్రత్యేక ప్రార్థన చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇఫ్తార్ విందు మత సామరస్యాన్ని చాటిందన్నారు. గతంలో కడప డీఎస్పీగా విధి నిర్వహణలో ఉన్నప్పుడు వినాయక చవితి, బక్రీద్, ఉగాది, రంజాన్ పండుగల సమయంలో హిందూ, ముస్లిం సోదరులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఉగాది సందర్భంగా తాను దేవుని కడప ఆలయానికి వెళ్లినప్పుడు ముస్లింలు పూజలు నిర్వహించడం, అమీన్ పీర్ దర్గాను హిందువులు దర్శించుకోవడం కడప జిల్లా మత సామరస్య ఘనతకు నిదర్శనమన్నారు. అనంతపురం జిల్లాలోని గూగూడు కుళ్లాయి స్వామిని దర్శించుకున్నప్పుడు అక్కడ ముస్లిం సోదరులతో పాటు పెద్ద ఎత్తున హిందూ సోదరులు పూజలు చేయడం సామరస్యతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచి భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిందన్నారు. జిల్లాలో సోదరభావం, సమైక్యత భావం మున్ముందు కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. జిల్లా అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులకు ఇచ్చే ఇఫ్తార్ విందు లాంటి కార్యక్రమాలు ప్రజలలో సోదర భావాన్ని పెంపొందిస్తాయన్నారు. ముస్లిం ప్రముఖులు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం ఉండటం మన దేశ గొప్పతనమని, అందువల్లే ప్రపంచ దేశాలు దేశ కీర్తి ప్రతిష్టలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య, నగరంలోని ముస్లిం ప్రముఖులు, వన్ టౌన్ సి.ఐ రామకృష్ణ, టూ టౌన్ సి.ఐ నాగార్జున, చిన్నచౌకు సి.ఐ ఓబులేసు, ఆర్ఐలు వీరేష్, శ్రీశైల రెడ్డి, శివరాముడు, చిన్నచౌకు ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి, టూ టౌన్ ఎస్.ఐ ఎస్.కె.ఎం హుస్సేన్, రిమ్స్ ఎస్.ఐ జయరాముడు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, పోలీస్ సిబ్బంది, నగరంలోని ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని బద్వేలు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో

4వ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు డిమాండ్ చేశారు. ఆదివారం కడపలో విలేకరులతో మాట్లాడుతూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపాలంటే భయాందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలతో సంబంధం లేకుండా ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన వారిని టీచర్లుగా నియమించుకోవడం కారణంగా ఈ ఘటన జరిగిందన్నారు.

కూటమి ప్రభుత్వంలో దళిత, మైనార్టీలకు రక్షణ లేదు

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులు, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిషోర్ బూసిపాటి అన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద రీతిలో మృతి చెందితే కేసు నమోదు విషయంలోనూ, పోస్టుమార్టం చేసే సమయంలోనూ పోలీసులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. అతన్ని అత్యంత దారుణంగా హత్య చేసిన ఆనవాళ్లు ఉన్నప్పటికీ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు వేగంగా చర్యలు తీసుకోవడంలో విఫలయ్యారన్నారు. దీన్నిబట్టే రాష్ట్రంలో క్రిష్టియన్ మైనార్టీలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా తిరిగే పరిస్థితి లేదని అర్థమవుతోందన్నారు. పగడాల ప్రవీణ్ తనకు ప్రాణహాని ఉందని చాలా రోజులుగా చెబుతున్నా ఆయనకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. హత్యపై అన్ని జిల్లాల్లో నిరసనలు వ్యక్తమవుతుంటే సీఎం చంద్రబాబుగానీ,



మాట్లాడుతున్న దళిత ఫోరం నేత కిషోర్ బూసిపాటి

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌గానీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి స్తంభాలైన భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ సిద్ధాంతాలు అమలవుతుండటం వల్ల మైనారీలు, క్రిష్టియన్లకు రక్షణ కరువవుతోందన్నారు. ప్రవీణ్ హత్య కేసులో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు పెంచలయ్య పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలను అధిరోహించాలి

ట్రిపుల్ ఐటీ ఏఓ రవి కుమార్

కమలాపురం : ప్రతి విద్యార్థి గురువులు చెప్పే పాఠాలు విని అవగాహన చేసుకుని మంచి ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ట్రిపుల్ ఐటీ ఆర్కే వ్యాలీ ఇడుపులపాయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రవి కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లోని డీఏవీ భారతి విద్యా మందిర్ 6వ వార్షికోత్సవ వేడుకలను బీసీసీపీఎల్ సీఎంఓ సాయి రమేష్ పర్యవేక్షణలో ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రిపుల్ ఐటీ ఏఓ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా ఏరోజు చెప్పిన పాఠాలను అదే రోజు చదివి అవగాహన చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు కృషి చేయాలన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. వేంపల్లె ఎంఈఓ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలన్నీ శ్రద్ధగా విని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, అప్పుడే తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామాలకు మంచి పేరు ప్రతిష్టలు వస్తాయన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా, ఇష్టపడి చదవాలన్నారు. కోర్ అడ్వైజరీ సుబ్బులక్ష్మీ సాయి రమేష్ మాట్లాడుతూ డీఏవీ భారతి విద్యా మందిర్ ఇటు విద్యలోనూ, అటు క్రీడా పోటీల్లోనూ రాణిస్తోందని, అందుకు కృషి చేస్తున్న ప్రిన్సిపల్ కిషోర్ కుమార్‌ను అభినందించారు. అలాగే డీఏవీ రీజనల్ ఆఫీసర్ వీఎస్ఎన్‌కే శేషాద్రి, చీఫ్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, ఐఆర్‌పీఆర్ చీఫ్ భార్గవ్ రెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



కోర్ అడ్వైజరీ సుబ్బులక్ష్మీ సాయి రమేష్‌ను సన్మానిస్తున్న అతిథులు

సామాజిక అడవిలో మంటలు

కమలాపురం : మండలంలోని రామచంద్రాపురం సమీపంలో ఉన్న సామాజిక అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ అటవీ ప్రాంతంలో ఎక్కువగా ఉన్న తాటి చెట్ల నుంచి తాటి పట్టలు రాలిపోయి ఎండిపోయాయి. గుర్తు తెలియని ఆకతాయిలు వాటికి నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసి పడుతూ చుట్టు పక్కలకు వ్యాపించాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైరింజన్‌తో హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



సామాజిక అటవీ ప్రాంతంలో ఎగిసి పడుతున్న మంటలు